క్లుప్తంగా

బాధితులను ఆదుకోవాలి



పరామర్శిస్తున్న వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్

వెల్దుర్తి(తూప్రాన్): కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షానికి మండలంలోని పలు గ్రామాల్లో నివాస గృహాలు, పూరి గుడిసెలు దెబ్బతిన్నాయి. ఈ సందర్భంగా వెల్దుర్తి కోటకింద వాడలో దెబ్బతిన్న ఇళ్లను శుక్రవారం వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్ పరిశీలించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కిషన్‌రెడ్డి అరెస్ట్ సరికాదు



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

రామాయంపేట(మెదక్): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేసినందుకు నిరసనగా ఆ పార్టీ నాయకులు శుక్రవారం నార్సింగి మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. రెండు పడకల ఇళ్ల పరిశీలనకు వెళ్తున్న కిషన్‌రెడ్డిని అరెస్ట్ చేయడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణాధ్యక్షుడు శేఖర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నశంకరంపేట(మెదక్): డబుల్‌బెడ్రూం ఇళ్లను పరిశీలించేందుకు వెళ్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అడ్డుకోవడం దారుణమని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు జనగామ మల్లారెడ్డి విమర్శించారు.

శుభాకాంక్షలు



కిషన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న మురళీయాదవ్

నర్సాపూర్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా కిషన్‌రెడ్డి శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో ఆయనకు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్ శుభాకాంక్షలు తెలిపారు.

జాగ్రత్తలు అవసరం



సూచనలు చేస్తున్న వైద్య బృందం

మనోహరాబాద్(తూప్రాన్): సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని 1వ, 2వ వార్డుల్లో ఇంటింటికీ వారు పర్యటించి ఇంటి వద్ద కుళాయి, పాత సామగ్రి ఉంటే వాటిలో నీరు నిల్వ లేకుండా చూడాలని ఇంటి యజమానులకు సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పరిసరాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓలు బాల్‌నర్సయ్య, సల్లుబాయి, సూపర్ వైజర్ శారద, కృష్ణ, ఏఎన్‌ఎంలు వినోద, లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి రూపగౌడ్ తదితరులున్నారు.

బాలల హక్కులపై అవగాహన

కౌల్దారం(నర్సాపూర్): మండలం కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో కైలాష్ సత్యార్థి ఫౌండేషన్ సహకారంతో కార్వెడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాలలకు హక్కులపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ సాక్రూబాయ్ మాట్లాడుతూ.. బాలల హక్కుల్లో ప్రధానమైన విద్య హక్కు, బాల్యవివాహాల నిర్మూలన, పిల్లల భవిష్యత్‌కు తీసుకోవాల్సిన అంశాలపై వివరించారు. బాల్య వివాహాల కోసం సంబంధం మాట్లాడుతున్న విషయాన్ని వెంటనే సంబంధిత అధికారులకు, లేదా టోల్ ఫ్రీ నెంబర్లలైన 1098,100 కు కాల్ చేయాలన్నారు. ఈ సదస్సులో సంస్థ ప్రతినిధి సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం

మెదక్ మున్సిపాలిటీ: ప్రజలు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ సూచించారు. శుక్రవారం మెదక్ పట్టణంలో 20వ వార్డులో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లక్ష్మీనారాయణగౌడ్, శ్రీనివాస్, గోదాల సాయిరాం, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

జలకళ

జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు, కుంటలు, చెరువులు జలకళ సంతరించుకున్నాయి. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే పలు గ్రామాల్లో ఇళ్లు కూలిపోయాయి.



పెద్దశంకరంపేట(మెదక్): రామోజిపల్లిలో అలుగు పారుతున్న దృశ్యం



చిలప్‌చెడ్(నర్సాపూర్): సోమక్కపేట్ చెరువు వద్ద పారుతున్న అలుగు



మెదక్ మున్సిపాలిటీ: ఎస్పీ కార్యాలయం ఎదుట రోడ్డుపై గుంతలు



అల్లాదుర్గం ప్రధాన రహదారిపై ..



నర్సాపూర్ రూరల్: నర్సాపూర్‌లోని రాయరావు చెరువు వద్ద..



హవేళీఘనపూర్: అలుగుపారుతున్న నాగాపూర్ చెరువు



నర్సాపూర్ రూరల్: బ్రాహ్మణపల్లిలో..



రామాయంపేట(మెదక్): సుతారిపల్లిలో కూలిన ఇల్లు



చేగుంట(తూప్రాన్): చిట్టోజిపల్లిలో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న ఆర్‌ఐ నర్సింగ్ యాదవ్



కౌల్దారం(నర్సాపూర్): సంగాయిపేటలో నీట మునిగిన వరి



కౌల్దారం(నర్సాపూర్): కోనాపూర్‌లో మత్స్యకారులకు దొరికిన భారీ చేప



కౌడిపల్లి(నర్సాపూర్): ముట్రాజ్‌పల్లి చెరువు అలుగు వద్ద..



తూప్రాన్ - కిష్టాపూర్ రహదారిపై పొర్లుతున్న చెక్‌డ్యాం



కౌల్దారం(నర్సాపూర్): పటేల్ చెరువు వద్ద..

మంజీరా పరిసరాల్లో సరదాలు వద్దు

చిలప్‌చెడ్(నర్సాపూర్): కురుస్తున్న వర్షాలకు మంజీరా వాగు ఉధృతంగా ప్రవహిస్తుందని ఎస్‌ఐ మహ్మద్‌గౌస్ అన్నారు. శుక్రవారం ఈ సందర్భంగా ఆయన మండలంలోని చిట్కుల్ శివారులోని వంతెన వద్ద మంజీరా వాగు ఉధృతి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉధృతంగా ప్రవహిస్తున్న మంజీరా వాగు దగ్గరకు వెళ్లి సెల్ఫీలు దిగే ప్రయత్నాలు చేసి ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దన్నారు. మత్స్యకారులు సైతం వరద ఉధృతి తగ్గే వరకు చేపల వేటకు వెళ్లొద్దన్నారు. ప్రవహిస్తున్న నీటి వద్ద సరదాలు, వినోదాలు అంటూ నీటిలో దిగి ప్రమాదాలకు గురికావద్దని హెచ్చరించారు. కొద్ది రోజుల పాటు బ్రిడ్జి పరిసర ప్రాంతాల వద్దకు



చిలప్‌చెడ్(నర్సాపూర్): చిట్కుల్ వద్ద మంజీరా ఉధృతిని పరిశీలిస్తున్న ఎస్‌ఐ మహ్మద్‌గౌస్

ఎవ్వరు రావొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

హాస్టల్ ఆవరణలో నిలిచిన వరద నీరు

రామాయంపేట(మెదక్): భారీ వర్షాలతో వరద నీరు ఇళ్లలోకి ప్రవేశించడంతో శుక్రవారం మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్ ఉమాదేవి పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా లోతట్టు ప్రాంతాల్లో ఉన్న బాలికల హాస్టల్ ఆవరణలో వరదనీరు నిలిచింది. దీంతో విద్యార్థినులు తీవ్ర ఆందోళన చెందారు. సమాచారం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ వెళ్లి జేసీబీ సహాయంతో కాల్వ తీయించి నీటిని తరలించారు. ఇళ్ల ఎదుట



వరద నీటిని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్, కమిషనర్ ఉమాదేవి

మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలని చైర్మన్ సూచించారు.

కుంటకు గండి.. పంటలకు నష్టం

చిన్నశంకరంపేట(మెదక్): ఐదురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని చందాపూర్ గ్రామంలోని ఓ కుంటకట్టకు గండిపడింది. దీంతో కుంట కింద నాట్లువేసిన 20 ఎకరాల పంటకు నష్టం జరిగింది. రైతులకు ఒక్కొక్కరికి పెట్టుబడి డబ్బులు, రైతు కష్టం నీటిపాలైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గండిని పూడ్చాల్సిన అధికారులు నామ మాత్రంగా ఇసుక బస్తాలు వేసి చేతులు దులుపుకున్నారని, వరద ఉధృతికి గండి ఆగేలేదని మరింత నష్టం జరగకముందే అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని రైతులు కోరారు. ఉన్నత అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలన్నారు.



చందాపూర్ గ్రామంలో గండిపడిన కుంటకట్ట

నిందితులను శిక్షించాలి

మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి



నర్సాపూర్: మణిపూర్‌లో జరిగిన దుర్ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి కోరారు. మణిపూర్‌లో ఇద్దరు గిరిజన మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించిన దుర్ఘటన తనను తీవ్రంగా కలిచి వేసిందని ఆమె ట్వీట్ చేయడంతో పాటు పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఇద్దరు గిరిజన మహిళలపై జరిగిన దుర్ఘటన అమానుషం, చాలా బాధకరమన్నారు. ఈ సంఘటన తనను చాలా తీవ్ర ఆవేదనకు గురి చేసిందని పేర్కొన్నారు. నిందితులను కఠినంగా శిక్షించి బాధితులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా ఉంటాయని తాను ఆశిస్తున్నట్లు సునీతారెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

విఠల్‌రెడ్డి సేవలు మరువలేనివి

ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: పట్టణాభివృద్ధికి కోటి విఠల్ రెడ్డి సేవలు మరువలేనివని ఎమ్మెల్సీ సుభాశ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని జీకేఆర్ గార్డెన్స్‌లో విఠల్‌రెడ్డి ద్వాదశ దినకర్మకు హాజరై ఎమ్మెల్సీ నివాళులర్పించారు. అలాగే మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్ రెడ్డి మెదక్ టౌన్ రెడ్డి సంఘం గౌరవ అధ్యక్షుడు ప్రభురెడ్డి, జిల్లా జనరల్ సెక్రెటరీ శ్రీకాంత్ రెడ్డి, మెదక్ టౌన్ అధ్యక్షుడు సంపత్ రెడ్డి తదితరులు నివాళులర్పించారు.

దళితబంధు బీఆర్‌ఎస్ వారికేనా..?

రామాయంపేట(మెదక్): దళితబంధు కేవలం బీఆర్‌ఎస్ వారికే ఇవ్వడం ప్రజాస్వామ్యాన్ని కాలరాయడమేనని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్ అన్నారు. ఆయన శుక్రవారం నార్సింగిలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో లక్షలాది మంది నిరుపేదలుండగా, కేవలం బీఆర్‌ఎస్‌లో ఉన్న నాయకులకే ఈపథకం వర్తింపజేస్తున్నారని ఆరోపించారు. కాగా ఎస్సీ కులానికి చెందిన ఉద్యోగులకు కూడా ఈపథకం వర్తిస్తుందని ప్రభుత్వం ప్రకటించం సిగ్గుచేటని విమర్శించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నర్సాపూర్: ముసురుతో కూడిన వర్షాలు కురుస్తున్నందున అప్రమత్తంగా ఉండాలని నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్ ప్రజలను కోరారు. ఆయన శుక్రవారం పట్టణంలో పర్యటించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ... పట్టణంలో పర్యటించి మురికి కాల్వల్లో చెత్త చెదారం ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని పారిశుద్ధ్య సిబ్బందికి సూచనలు చేసినట్లు చెప్పారు. పట్టణంలో 32 ఇళ్లు శిథిలావస్థకు చేరిన ఇళ్లను గుర్తించామన్నారు. మున్సిపాలిటీ ఆఫీస్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని, అత్యవసర సేవలకు 99635 90303 నంబరుకు ఫోన్ చేయాలని కోరారు. ఆయన వెంట మున్సిపల్ మేనేజర్ మధుసూదన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీ తదితరులు ఉన్నారు.

రామాయంపేట(మెదక్): రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నందున మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్ సూచించారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. పాక్షికంగా శిథిలమైన, పురాతన గృహాలు కూలే ప్రమాదం ఉండటంతో వాటిని వెంటనే ఖాళీ చేయాలన్నారు. బోర్ల వద్దకు



నర్సాపూర్‌లో పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్

వెళ్తున్న రైతులు కరెంట్ వైర్లను ముట్టుకోవద్దని, ఇది అత్యంత ప్రమాదకరమని పేర్కొన్నారు. ప్రస్తుతం చెరువులు నిండుకొని అలుగు పారుతున్నందున ప్రజలు చెరువుల వద్దకు వెళ్లొద్దని, ఏదైనా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుంటే వెంటనే తనకు లేదా పోలీస్‌స్టేషన్‌కు సమాచారం

పెద్దశంకరంపేట(మెదక్): భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేట ఎస్‌ఐ బాలరాజు అన్నారు. విద్యుత్ వైర్లను తాకొద్దని, బోరుబావుల వద్ద రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

పంచాయతీ కార్మికుల వినూత్న సమ్మె



నిజాంపేటలో వరి నాటు వేసి నిరసన తెలుపుతున్న జీపీ కార్మికులు

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని పలు గ్రామాల్లో పనిచేసే గ్రామ పంచాయతీ కార్మికులు తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని చేస్తున్న సమ్మె శుక్రవారం నాటికి పదహారవ రోజుకు చేరింది. ఈ మేరకు కార్మికులు మండల కేంద్రంలోని నూతన బస్టాండ్ వద్ద వినూత్నంగా వరినాట్లు వేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు చెవిలో పువ్వులు ధరించి, చేతిలో చిప్పతో సమ్మె చేశారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ కార్మిక ఉపాధ్యక్షుడు ఆసిఫ్, పంచాయతీ కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రంలో నిర్వహిస్తున్న జీపీ కార్మికుల సమ్మెలో జీపీ కార్మికుల సంఘం మండలాధ్యక్షుడు ఎల్లం, నాగభూషణం, సామేశ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కార్మికులకు మహ్మద్‌నగర్ గ్రామ సర్పంచ్ భర్త మహిపాల్‌రెడ్డి మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు.

త్వరలో పట్టాల పంపిణీ

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని గౌతోజీగూడెంలో లబ్ధిదారులకు త్వరలోనే ప్లాట్ల పట్టాలు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ భిక్షపతి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఇచ్చిన ప్లాట్లకు కలెక్టర్ ఆదేశాల మేరకు లబ్ధిదారుల లిస్టును పంపినట్లు తెలిపారు. శుక్రవారం గ్రామంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. 74 మందికి 60 చదరపు గజాల చొప్పున సర్టిఫికేట్స్ ఉండగా, ప్రస్తుతం అందులోంచి సంగారెడ్డి కెనాల్‌కు 14 గుంటల భూమి పోతుందన్నారు. కార్యదర్శి నందిని, గ్రామస్తులు, పాలకవర్గ సభ్యులున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **లోతట్టు ప్రాంతాలు జలమయం**

రేగోడ్(మెదక్): మండలంలో ఎడతెరిపిలేకుండా వర్షం పడుతోంది. లోతట్టు ప్రాంతాలు, గుంతలు జలమయం అయ్యాయి. కుంటలు, చెరువులోకి భారీగా నీళ్లు చేరుతున్నాయి. కాగా 73.8 ఎంఎం వర్షపాతం నమోదు అయిందని తహసీల్దార్ సిబ్బంది తెలిపారు.

◆ **వర్షంలోనూ పర్యటన**



రేగోడ్(మెదక్): ఓ పక్క భారీ వర్షాలు కురుస్తున్నా.. కాంగ్రెస్ నేత త్రిష దామోదర్ పల్లె పల్లెకు వెళ్లి ప్రజలను కలుస్తూ ఆత్మీయంగా పలకరిస్తున్నారు. శుక్రవారం మండలంలోని కొండాపూర్ గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల యోగా క్షేమాలు, సమస్యలను తెలుసుకున్నారు. తన తండ్రి దామోదర్ రాజనర్సింహ చేసిన అభివృద్ధి పనులను వివరించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు మున్నూరు కిషన్, పార్టీ అధ్యక్షుడు ఎస్.దిగంబరావు, జెడ్పీటీసీ యాదగిరి, వైస్ ఎంపీపీ వినీల, కో ఆప్షన్ సభ్యుడు చోటుమియా, మాజీ సర్పంచ్ గంజి సంగమేశ్వర్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పీర్యానాయక్, ఎంపీటీసీ శ్రీకాంత్ నాయక్, పార్టీ గ్రామాధ్యక్షుడు శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

◆ **కౌల్దారం తహసీల్దార్ బదిలీ**

కౌల్దారం(నర్సాపూర్): మండల తహసీల్దార్‌గా పనిచేసిన చంద్రశేఖర్‌రావు బదిలీపై మెదక్ కలెక్టరేట్ కార్యాలయానికి వెళ్లినట్లు తహసీల్దార్ కార్యాలయ వర్గాలు శుక్రవారం తెలిపారు. ప్రస్తుతం డిప్యూటీ తహసీల్దార్‌గా కొనసాగుతున్న కిశోర్ తాత్కాలిక తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారన్నారు.

◆ **సన్మానం**

చేగుంట(తూప్రాన్): చేగుంటకు బదిలీపై వచ్చిన తహసీల్దార్ శ్రీనివాస్‌ను బీజేపీ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గణేశ్, బీజేపీ మండలాధ్యక్షుడు భూపాల్, రాజగోపాల్, మహేశ్ తదితరులు ఉన్నారు.

◆ **దరఖాస్తుల ఆహ్వానం**

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల దరఖాస్తులను ఆహ్వానిస్తుననట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ దామోదర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలో కామర్స్‌లో రెండు పోస్టులు, తెలుగు, ఇంగ్లీషు, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్, జువాలజీ, కంప్యూటర్ సైన్స్ విభాగాల్లో ఒక్కొక్క పోస్టు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఇందుకు గాను ఆయా సబ్జెక్ట్‌ల్లో పీజీలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం , ఇతరులు 55 శాతం మార్కులు కలిగి ఉండి, పీ.హెచ్.డీ, నెట్/సెట్ అర్హత కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందన్నారు. సంబంధిత దరఖాస్తులను, అర్హత పత్రాల జిరాక్స్ కాపీలతో జత చేసి మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం 24 లోగా అందజేయాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ ఒరిజినల్, జిరాక్స్ పత్రాలతో మంగళవారం 25న ఉదయం 11 గంటలకు డెమో, ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

బాధితులకు అండగా ఉంటా

హవేళీఘనపూర్: ఇళ్లకూలిపోయిన కుటుంబాలకు మైనంపల్లి స్వచ్ఛంద సంస్థ అండగా ఉండి వారికి అన్ని విధాలా సహకరిస్తుందని మైనంపల్లి సోషల్ ఆర్గనైజేషన్ చైర్మన్ మైనంపల్లి రోహిత్ అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని కూచన్‌పల్లి, నాగాపూర్ గ్రామాల్లో పర్యటించి ఇటీవల కురిసిన భారీ వర్షాలతో కూలిపోయిన ఇళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో కూచన్‌పల్లి సర్పంచ్ దేవాగౌడ్, మహేందర్‌రెడ్డి, ఎంఎస్‌ఎస్‌వో సభ్యులు పరశురామ్‌గౌడ్, బొజ్జ పవన్, రాజేశ్, ప్రశాంత్, వెంకన్న, మల్లేశం, రాజయ్య, భరత్ రామ్, శంకర్, సంగమేశ్వర్, రిజ్వన్, ప్రతాప్‌రెడ్డి, భానుప్రసాద్, అంజద్, రాము, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

◆ **సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత**

రామాయంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రానికి చెందిన రాజంపేట లలితకు రూ. 36 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును శుక్రవారం బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు బాబు అందజేశారు. కార్యక్రమంలో నార్సింగి ఎంపీటీసీ సత్యనారాయణ, వార్డు సభ్యుడు ఫరీద్, టెలికాం బోర్డు మాజీ సభ్యుడు అంచనూరి రాజేశ్ పాల్గొన్నారు.